నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
29 జూన్ 2024
పేజీలు: 02





మెగా ఫైనల్
సౌతాఫ్రికా vs ఇండియా
నేడు 8.00 రాత్రి



# ధర్మపురి శ్రీనివాస్ ఇకలేరు

## గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన మాజీ మంత్రి

## కొద్ది నెలలుగా అనారోగ్యంతో భాదపడుతున్న డీఎస్

## సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా సేవలందించారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన.. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాలతో మళ్లీ కాంగ్రెస్ కండువా సొంత గూటికి చేరిపోయారు. డీఎస్‌కు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ ప్రస్తుతం బీజేపీ తరఫున నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్ పనిచేశారు. 1948 సెప్టెంబర్ 27న జన్మించిన డీఎస్.. నిజాం కళాశాల నుంచి డిగ్రీ పూర్తి చేశారు. 1989లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలోకి డీఎస్, తొలి సారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.అనంతరం 1999, 2004లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1998లో ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్రం అవిర్భావం తర్వాత 2014లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సలహాదారుగా, రాజ్యసభ సభ్యులుగా కొనసాగిన డీఎస్.. శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, తదితర సీనియర్ నేతలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన డీఎస్ సోనియా గాంధీకి విధేయునిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

**సోనియా గాంధీకి విధేయునిగా..**

డీఎస్‌కు ప్రణబ్ ముఖర్జీ తదితర సీనియర్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సోనియా గాంధీకి విధేయునిగా గుర్తింపు ఉంది. జైపాల్ రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మంచి సంబంధాలు ఉన్నాయి. 2013 నుంచి 2015 వరకు శాసనమండలి సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం శాసనమండలిలో విపక్ష నేతగా కొనసాగారు. రెండో సారి ఎమ్మెల్సీగా అవకాశం రాకపోవడంతో అసంతృప్తి చెంది.. 2015లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి తెరాసలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 2016 నుంచి 2022 వరకు తెరాస రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో భారాసతో విభేదించి.. కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరిపి తిరిగి సొంతగూటికి చేరుకున్నారు.

### అధికారిక లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు

తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో కాంగ్రెస్ సీనియర్ నేత డి.శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతి కుమారిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిజామాబాద్‌లో మధ్యాహ్నం డీఎస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### ఆదివారం అంత్యక్రియలు..

డీఎస్ పార్థివ దేహాన్ని ఆస్పత్రి నుంచి బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహానికి తరలించి.. మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. పార్లమెంట్ సమావేశాల కోసం దిల్లీలో ఉన్న డీఎస్ కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకుంటారు. అనంతరం భౌతిక కాయాన్ని నిజామాబాద్‌కు తరలిస్తారు. ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు.

### నా తండ్రి.. నా గురువు అన్నీ నాన్నేః అర్వింద్



తండ్రి మృతి పట్ల డీఎస్ కుమారుడు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోషల్ మీడియా వేదికగా ఆయన స్మృతులను గుర్తు చేసుకున్నారు. "అన్నా.. అంటే నేనున్నా అని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు. I WILL MISS YOU DADDY ! నా తండ్రి, నా గురువు అన్నీ మా నాన్నే.! ఎదురొడ్డు, పోరాడు, భయపడకు అని నేర్పింది మా నాన్నే.. ప్రజలను ప్రేమించు,ప్రజల కొరకే జీవించు అని చెప్పింది మా నాన్నే. నాన్నా..! నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు ఎప్పటికీ నా లోనే ఉంటావు." అంటూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు



ధర్మపురి శ్రీనివాస్ మృతికి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయడు సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డీఎస్ మంత్రిగా, ఎంపీగా తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. శ్రీనివాస్ ఎప్పుడూ హుందాగా రాజకీయాలు చేసేవారని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. డీ.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం చంద్రబాబు ప్రార్థించారు.

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం



సీనియర్ రాజకీయ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.విచారం వ్యక్తం చేశారు. వారి సుదీర్ఘ రాజకీ య జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యా రన్నారు. 2004-2009లో అసెంబ్లీలో వారందించిన ప్రోత్సాహం మరువలేని దన్న కిషన రెడ్డి, డి.శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన, బీజేపీ ఎంపీ అరవింద్, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### సీఎం రేవంత్ రెడ్డి సంతాపం..

డీఎస్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా డీఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని అభిప్రాయపడ్డారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్, రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తు చేసుకున్నారు. డీ శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కాంగ్రెస్ వీరవిధేయుడు

డీఎస్ అంటే కాంగ్రెస్‌లో ఢిల్లీ పెద్దలు కూడా గుర్తు పడతారు. పార్టీ విధేయుడిగా గుర్తింపు తెచ్చుకున్న డీఎస్ అనివార్య కారణాలతో పార్టీని వీడాల్సి వచ్చింది. 2015లో ఎమ్మెల్సీ ఇవ్వలేదని కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్లో చేరారు. అక్కడ 2016-2022 వరకు రాజ్యసభ సభ్యుడు అయ్యారు. అనంతరం అక్కడ కూడా కేసీఆర్‌తో పొసగకపోవడంతో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఏ పార్టీతో తన రాజకీయా ప్రస్తానం ప్రారంభమైందో ఆ పార్టీలోనే తుది శ్వాస విడిచారు.



# నేడే ఫైనల్ ఫైట్!

నేడు భారత్, సౌతాఫ్రికా మధ్య టీ20 వరల్డ్ కప్-2024 ఫైనల్ మ్యాచ్ జరగనుంది. బ్రిడ్జిటౌన్ వేదికగా రా.8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ ఫార్మాట్లో 17ఏళ్ల నిరీక్షణకు తెరదించి రెండోసారి ట్రోఫీ సొంతం చేసుకోవాలని భారత్ భావిస్తోంది. సౌతాఫ్రికాపై గెలిచి విశ్వవిజేతగా నిలవాలని పట్టుదలతో ఉంది. మరోవైపు ఇప్పటివరకు ఐసీసీ ట్రోఫీ నెగ్గని సౌతాఫ్రికా కూడా టైటిల్ గెలవాలని చూస్తోంది. దీంతో ఇరు జట్ల మధ్య ఫైనల్ ఫైట్ హోరాహోరీగా సాగనుంది.

### హెడ్ టు హెడ్ రికార్డులివే..

ఇప్పటివరకు అంతర్జాతీయ T20ల్లో ఇరు జట్లు 26 సార్లు తలపడ్డాయి. ఇందులో ఇండియా 14, సౌతాఫ్రికా 11 సార్లు గెలవగా 1 మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. అలాగే వరల్డ్ కప్ ల్లో 6 సార్లు తలపడగా టీమ్ ఇండియా 4, సౌతాఫ్రికా 2 సార్లు గెలుపొందాయి. ఏవిధంగా చూసుకున్నా ప్రొటీస్‌పై భారత్‌దే ఆధిపత్యంగా కనిపిస్తోంది. ఇవాళ ఆ జట్టుపై గెలిచి తన ఆధిపత్యాన్ని కొనసాగించాలని భారత్ చూస్తోంది.

### రోహిత్ శర్మ, కోహ్లీకి ఇదే చివరి మ్యాచ్?

టీమ్ ఇండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఇవాళ జరిగే టీ20 వరల్డ్ కప్ ఫైనల్ చివరి మ్యాచ్ అని తెలుస్తోంది. గెలిచినా, ఓడినా వీరిద్దరికీ ఇదే ఆఖరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ అయ్యే ఛాన్స్ ఉంది. కుర్రాళ్లకు అవకాశం ఇచ్చేందుకు వీరిద్దరూ పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. వన్డే, టెస్టుల్లో ఇంకెన్నాళ్లు కొనసాగుతారో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

### దేశాల వారీగా ఐసీసీ ట్రోఫీలు

10- ఆస్ట్రేలియా (వన్డే WC 6, T20 WC 1, WTC- 1, ఛాంపియన్స్ ట్రోఫీ 2)
5- భారత్ (వన్డే WC 2, T20WC 1, ఛాంపియన్స్ ట్రోఫీలు 2)
5- వెస్టిండీస్ (వన్డే WC 2, T20WC 2, ఛాంపియన్స్ ట్రోఫీ 1)
3- పాకిస్థాన్ (వన్డే WC 1, T20WC 1, ఛాంపియన్స్ ట్రోఫీ 1)
3- ఇంగ్లండ్ (వన్డే WC 1, T20WC 2)
3- శ్రీలంక (వన్డే WC 1, T20WC 1, CT 1)
2- న్యూజిలాండ్ (WTC 1, CT 1)
1- సౌతాఫ్రికా (ఛాంపియన్స్ ట్రోఫీ 1)

### కోహ్లీ రాజులకే రాజు: కృష్ణమాచారి శ్రీకాంత్

టీమ్ ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఫామ్ గురించి ఆందోళన అవసరం లేదని భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నారు. కోహ్లీ రాజులకే రాజు అని, ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన చేస్తారని చెప్పారు. 'తుదిపోరులో రోహిత్ శర్మ కాదు.. విరాటే గెలిపిస్తారు. మూణ్నాలుగు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన టెన్షన్ అవసరం లేదు. ఆయన బిగ్ మ్యాచ్ ప్లేయర్. విరాట్‌పై నమ్మకం ఉంచాలి' అని క్రిష్ వ్యాఖ్యానించారు.

### టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఒక్కసారీ అలా జరగలేదు!

టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకూ ఫైనల్ ఆడిన జట్లు మరోసారి ఫైనల్‌లో తలపడలేదు. ప్రతీ ఎడిషన్‌లో కొత్త ప్రత్యర్థులే ఎదురుపడ్డారు. భారత్VSపాక్ (2007), పాక్VSశ్రీలంక (2009), ఇంగ్లండ్VSఆసీస్ (2010), వెస్టిండీస్VSశ్రీలంక (2012), శ్రీలంకVSభారత్ (2014), వెస్టిండీస్VSఇంగ్లండ్ (2016), ఆస్ట్రేలియాVSన్యూజిలాండ్ (2021), ఇంగ్లండ్VSపాక్(2022), సౌతాఫ్రికాVSఇండియా (2024) ఫైనల్ చేరాయి.




### వొడాఫోన్ ఐడియా రీఛార్జ్ ధరలు పెంపు

వొడాఫోన్ ఐడియా రీఛార్జ్ ధరలు 10 నుంచి 21 శాతం పెరగనున్నాయి. ఈ పెంపు జులై 4 నుంచి అమల్లోకి వస్తుందని సంస్థ ప్రకటించింది. దీంతో రూ.179 రీఛార్జ్ ప్లాన్ రూ.199కి, రూ.269 ప్లాన్ రూ.299కి పెరగనుంది. ఇలా అన్ని ప్లాన్లపై ఛార్జీల పెంపు ఉండనుంది. ఇప్పటికే జియో, ఎయిర్‌టెల్ కంపెనీల టారిఫ్ ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## గాంధీ భవన్‌లో అటెండర్ ఉద్యోగం ఇచ్చినా.. చేస్తా :జగ్గారెడ్డి



కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తనకు అటెండర్ ఉద్యోగం ఇచ్చినా చేస్తాన్నారు. పీసీసీ పదవి ఎవరికి కట్టబెట్టినా తనకు అభ్యంతరం లేదని అన్నారు. కానీ ఈ పదేళ్లలో ఎప్పుడో ఒకసారి పీసీసీ పదవి చేపడుతాన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతానని మనుసులో మాట చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చినప్పుడు కూడా సహకరించామని చెప్పారు. సోనియా, రాహుల్ మాట జవదాటనని చెప్పారు. కానీ రాజకీయాల్లో ప్రధాని మోదీది తాత్కాలిక పవరే అని బీజేపీ వారు గుర్తించాలన్నారు. ప్రధానిగా ఆయన దిగిపోయాక బీజేపీలోనే పవర్ ఉండదన్నారు. ప్రజలు మూడోసారి చాలా కష్టంగా ఎన్డీయేకి అధికారం అప్పగించారన్నారు.గత పదేళ్లలో తాను ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అంగీకరించి... ఇప్పుడైనా వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గోద్రా అల్లర్లు, పుల్వామా ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు.





## 'హరితహారం' ఇక నుంచి 'వనమహోత్సవం'

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన 'తెలంగాణకు హరితహారం' పేరు మారింది. ఆ కార్యక్రమాన్ని 'వనమహోత్సవం'గా మారుస్తూ కాంగ్రెస్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జులై మొదటి వారం నుంచి 9 విడతలుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఇందులో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారు. టేకు, వేప, కానుగ, సుబాబులు, చింత, మామిడి, నిమ్మ, జామ, కొబ్బరి వంటి పలు రకాల మొక్కలను పెంచనున్నారు.

02 EVENING EDITION
శనివారం | 29 జూన్ 2024 4PM
www.suryaa.com
సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




# ఎనర్జిటిక్ గా "డబుల్ ఇస్మార్ట్" ఫస్ట్ సింగిల్ ప్రోమో





మన టాలీవుడ్ యంగ్ హీరోస్ లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ చిత్రం "డబుల్ ఇస్మార్ట్" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం కోసం అభిమానులు మంచి క్రేజీగా ఎదురు చూస్తుండగా మాస్ అండ్ డాషింగ్ దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ రేంజ్ సినిమాని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా ఫస్ట్ సింగిల్ పై ఇప్పటికే మంచి బజ్ నెలకొనగా ఇప్పుడు దీని తాలూకా ఫస్ట్ ప్రోమోని మేకర్స్ రిలీజ్ చేశారు. మరి ఇది మాత్రం మరో చార్ట్ బస్టర్ లా అనిపిస్తుంది అని చెప్పాలి. గతంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ ఫస్ట్ సింగిల్ ఏ రేంజ్ లో కిక్ ఇచ్చిందో దానికి డబుల్ కిక్ ఇచ్చే బీట్స్ ని మణిశర్మ అందించగా రామ్ మాస్ స్లాంగ్ తో ఈ ప్రోమో అదిరిపోయింది అని చెప్పాలి. ఇక ఈ ఫుల్ సాంగ్ అయితే ఈ జూలై 1న రిలీజ్ చేస్తున్నట్టుగా ఈ ప్రోమోతో రివీల్ చేశారు. మరి ఇదెలా ఉంటుందో వేచి చూడాలి. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్ విలన్ గా నటిస్తుండగా ఈ ఆగస్ట్ 15న సినిమా పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కాబోతుంది.

# బ్యాడ్ న్యూస్‌లో త్రిప్తి దిమ్రి

## జులై 19న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల

రణబీర్ కపూర్ యానిమల్ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది త్రిప్తి దిమ్రి. అంతకుముందు కొన్ని సినిమాలు చేసినా ఈ సినిమాతో బాగా పేరొచ్చింది. సోషల్ మీడియాలో ఫాలోయింగ్ పెరగడమే కాక అనేక సినిమా ఆఫర్స్ కూడా వచ్చాయి. త్రిప్తి దిమ్రి త్వరలో 'బ్యాడ్ న్యూస్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.త్రిప్తి దిమ్రి, విక్కీ కౌశల్, అమ్మి విరాక్ మెయిన్ లీడ్స్ లో ఆనంద్ తివారి దర్శకత్వంలో ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్లో బ్యాడ్ న్యూస్ సినిమా తెరకెక్కుతుంది. తాజాగా బ్యాడ్ న్యూస్ సినిమా ట్రైలర్ రిలీజ్ చేసారు.ఈ ట్రైలర్ లో.. హీరోయిన్ కి ప్రెగ్నెన్సీ వస్తే ఇద్దరు హీరోల్లో ఎవరు తండ్రో తెలియక అయోమయంలో ఉంటే పెటర్నిటీ టెస్ట్ చేస్తారు. దీంట్లో పుట్టబోయే బిడ్డకు ఇద్దరూ తండ్రులే అని వస్తుంది. దీంతో హీరోయిన్ తో ఏ హీరో లైఫ్ లాంగ్ ఉంటారు? ఎవరు వదిలేస్తారు? ఆ బిడ్డని తండ్రిగా ఎవరు ఒప్పకుంటారు.. అనే కథాంశంతో కామెడీ, ఎమోషన్ తో తెరకెక్కించినట్టు చూపించారు. మరి ఈ కామెడీ సినిమా ప్రేక్షకులని ఏ రేంజ్ లో మెప్పిస్తుందో చూడాలి.









# మహిళల టెస్టులో తొలిసారిగా 600 పరుగులు

### దక్షిణాఫ్రికాపై టీమిండియా ప్రపంచ రికార్డు

దక్షిణాఫ్రికాపై భారత మహిళా క్రికెట్ జట్టు అనూహ్య ప్రపంచ రికార్డు సృష్టించింది. మహిళల టెస్టులో తొలిసారిగా ఓ జట్టు 600 పరుగుల మార్కును అధిగమించింది. ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి, టీమ్ ఇండియా ఇప్పుడు మహిళల టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా అవతరించింది. రెండో రోజు తొలి సెషన్ ఆట కొనసాగుతుండగా.. టీమ్ఇండియా 5 వికెట్లు మాత్రమే కోల్పోయింది. దక్షిణాఫ్రికా పరిస్థితి పూర్తిగా దారుణంగా ఉంది. ఈ వార్త రాసే సమయానికి భారత జట్టు 115 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 603 పరుగులు చేసింది. మహిళల టెస్టు క్రికెట్‌లో తొలిసారిగా ఓ జట్టు 600 పరుగుల మార్కును అధిగమించింది. ఇప్పటి వరకు, ఆస్ట్రేలియా టెస్టు క్రికెట్‌లో ఈ ఏడాది అదే జట్టుపై చేసిన అతిపెద్ద స్కోరు చేసిన ప్రపంచ రికార్డును కలిగి ఉంది. ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా 575 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా 9 వికెట్లు కోల్పోయి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

# మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ ఇకలేరు


మాజీ ఎంపీ, బీజేపీ నేత రాథోడ్ రమేష్ కన్నుమూశారు. నిన్న రాత్రి ఉట్నూరులో తన నివాసంలో అస్వస్థకు గురికాగా.. కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రమేష్‌ను హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. రమేష్ రాథోడ్ మృతదేహాన్ని ఆయన స్వస్థలం ఉట్నూరుకు తరలించారు. మాజీ ఎంపీ రమేష్ రాథోడ్‌ను పార్టీ నుంచి టీపీసీసీ సస్పెండ్ చేయడంతో.. లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అనతంరం ఆయన బీజేపీలో చేరారు. రమేష్ రాథోడ్ 2009లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2018లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేసి ఓడిపోయారు. రాథోడ్ రమేష్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నర్నూర్



జడ్పీటీసీగా, ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన భార్య సుమన్ రాథోడ్‌ను రెండుసార్లు ఎమ్మెల్యేగా ఖానాపూర్ నియోజకవర్గం నుంచి గెలిపించుకున్నారు. ఆయన మృతి పట్ల అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రమేష్ రాథోడ్ మృతి పట్ల కేంద్రమంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతి

ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మృతి పట్ల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'అదిలాబాద్ ఎంపీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా రమేష్ రాథోడ్ అందించిన సేవలు మరువలేనివి. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి రమేష్ రాథోడ్ ఎంతో కృషి చేశారు. రమేష్ రాథోడ్ చనిపోయారంటే నమ్మలేకపోతున్నా. రమేష్ రాథోడ్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. రాథోడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా'అని సంతాపం తెలిపారు.




# డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

డీఎస్సీ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు CBRT విధానంలో రోజుకు రెండు షిఫ్టలలో పరీక్షలు జరగనున్నాయి. కాగా మొత్తం 11,062 పోస్టులకు 2,79,966 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల షెడ్యూల్ కోసం కింది ఆర్టికల్ చూడగలరు.

### ఏ రోజున ఏ పరీక్ష అంటే?

- జులై 18-మొదటి షిఫ్ట్‌లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్
- సెకండ్ షిఫ్ట్‌లో స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్
- 19-సెకండరీ గ్రేడ్ టీచర్
- 20-SGT, సెకండరీ గ్రేడ్ ఫిజికల్, స్పెషల్ ఎడ్యుకేషన్
- 22-స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్
- 24- స్కూల్ అసిస్టెంట్-జీవశాస్త్రం
- 26-తెలుగు భాషా పండిట్, సెకండరీ గ్రేడ్ టీచర్
- 30-స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్.



# 'పుష్ప' విలన్‌పై కేసు నమోదు

'పుష్ప' విలన్ ఫహాద్ ఫాజిల్‌పై కేరళలో కేసు నమోదయింది. ఆయన నటిస్తూ నిర్మిస్తున్న 'పెయిన్కిలీ' సినిమా షూటింగ్‌ను ఎర్నాకులం ప్రభుత్వాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో చిత్రీకరించారు. అందులోకి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మానవ హక్కుల కమిషన్.. నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేసు నమోదు చేసింది.




# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న పవన్ కల్యాణ్

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు ఆలయానికి తరలివచ్చారు. ఈ ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరిన పవన్‌కు.. మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు.

# రూ.2,00,000 రుణమాఫీపై సీఎం రేవంత్ కీలక ప్రకటన

రుణమాఫీ కింద పంట రుణాలు మాత్రమే మాఫీ అవుతాయని, బంగారం తాకట్టు రుణాలు దీని పరిధిలోకి రావని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డు కాకుండా కేవలం పట్టా పాస్ బుక్ ఆధారంగానే మాఫీ ఉంటుందని, మూడు, నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపారు. ఒక కుటుంబంలో మూడు నాలుగు రుణాలు కలిపి ఎంత ఎక్కువగా ఉన్నా గరిష్ఠంగా రూ.2 లక్షల వరకే మాఫీ వర్తిస్తుందని సీఎం వివరించారు.





# రాజకీయాలకు అలీ గుడ్‌బై

సినీనటుడు, వైసీపీ నాయకుడు అలీ రాజకీయాలకు గుడ్ బై చెప్పాడు. ఇకపై సామాన్యుడిగానే ఉంటానని పేర్కొన్నారు. సినిమాలు, షూటింగ్‌లు చూసుకుంటానని వెల్లడించారు. 20 ఏండ్ల పాటు తెలుగుదేశం పార్టీలో పనిచేశానని, ఆ తరువాత వైసీపీలోకి వచ్చానని తెలిపారు. 40 ఏండ్ల పాటు సినీ పరిశ్రమలో ఉన్నానని, నా సేవకు రాజకీయం తోడైతే పదిమందికి సాయమవుతుందని రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. 2019లో వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్న అలీకి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వయిజర్‌గా నియమించారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్‌కుగాని, అసెంబ్లీకి గాని అవకాశం వస్తుందని భావించారు. టికెట్ రాకపోవడంతో ప్రచారంలో ఎక్కడా కనిపించలేదు.



# 'ఆర్ఆర్ఆర్'కు రూట్ క్లియర్!

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగుతున్నాయి. ఒకేసారి ఉత్తర, దక్షిణ భాగాల(350.76KM) పనులు చేపట్టడమే ఉత్తమమన్న కేంద్రమంత్రి గడ్కరీ సూచనకు సీఎం రేవంత్ అంగీకరించారు. దీంతో భూసేకరణ ప్రక్రియ ఊపందుకోనుంది. నిర్మాణంలో భాగంగా తీగలు, స్తంభాలు, పైప్‌లైన్ల తరలింపు కోసం కేంద్రమే రూ.300Cr ఇస్తుందని మంత్రి చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. గతంలో ఇదేవిషయమై సందిగ్ధత నెలకొంది.